ముంపు ముప్పు తప్పేనా?

- మూడు నెలలైనా కనిపించని పురోగతి
- పిల్లర్ల డిజైన్లలో లోపాలు సుస్పష్టం
- రిటైనింగ్ వాల్ నిర్మాణంలోనూ సందేహాలు
- ట్రాఫిక్ ఆంక్షలతో వాహనదారులకు తప్పని తిప్పలు
- త్వరలో అందుబాటులో బ్రిడ్జి : ఎమ్మెల్యే నాయిని



పిల్లర్ల డైరెక్షన్ ఓ వైపు, నాలా ఓ వైపు ఉన్న దృశ్యం

నయీంనగర్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో జాప్యం

హనుమకొండ టౌన్, జూలై 13: నయీంనగర్ నాలా బ్రిడ్జి పనులలో జాప్యం జరుగుతోంది. వర్షాలు మొదలైనప్పటికీ నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. రానున్న రోజుల్లో వర్షాల తీవ్రత ఇంకా పెరిగే అవకాశం ఉండటంతో నాలా చుట్టుపక్కల ఉన్న కాలనీలకు వరద ముంపు తప్పేట్లు లేదని ఆవేదన చెందుతున్నారు.

వరద ముప్పు

చాలా ఏళ్లుగా నాలాకు ఇరుపైపులా జరిగిన ఆక్రమణలతో నాలా కుదించుకుపోయింది. దీంతో వర్షాకాలంలో ఇరువైపున ఉన్న కాలనీలు జలమయమవుతూ ఉన్నాయి. భారీ వర్షాలు కొట్టిన సమయంలో ఇళ్లలోకి వరదనీరు చేరి సమీప కాలనీల్లోని కుటుంబాలన్నీ రోడ్డున పడుతున్నాయి. ప్రజల ఇబ్బందులను గమనించిన పాలకవర్గాలు.. శాశ్వత పరిష్కారం కోసం నాలాపై నూతన బ్రిడ్జి నిర్మాణంతో పాటు ఆక్రమణలు నిలువరించడానికి రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టాయి. ఈ క్రమంలోనే ఏప్రిల్ 5న పాత బ్రిడ్జిని కూల్చారు. ఆ సమయంలో 3నెలల్లో బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకొస్తామని జిల్లా యంత్రాంగం వెల్లడించింది. ఆ తర్వాత పలుమార్లు జిల్లా కలెక్టర్‌ అధికారులతో సమీక్షలు జరిపి జూన్ చివరి వరకు బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

బ్రిడ్జి డిజైన్‌లో లోపాలు

వర్షాకాలం రాకముందే నిర్మాణం పూర్తి కావాలనే ఉద్దేశంతో పాత డిజైన్‌తోనే బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించారు. ప్రస్తుత బ్రిడ్జి నిర్మాణం పరిశీలిస్తే పిల్లర్లు ఒక వైపు, నాలా ఒక వైపు ప్రవహిస్తుంటుంది. వరద నీరు ఉధృతంగా వచ్చినప్పుడు నీరంతా ఆ ప్రవాహ తాకిడికి వెనకకు తన్ని కాలనీల్లోకి, ప్రధాన రహదారిపైకి వచ్చే ప్రమాదం ఉందని కొంతమంది స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అయితే దాంతో పెద్దగా ప్రమాదం ఏం ఉండదని నిపుణులు అంటున్నారు. డిజైన్‌ను మార్చినట్లయితే కింది ఫుటింగ్, ఫ్లోరింగ్, పిల్లర్ల నిర్మాణాన్ని మార్పు చేయాల్సి ఉంటుంది. దాంతో వర్షాకాలం దాటిపోయే అవకాశం ఉండటంతో ఒరిజినల్ డిజైన్‌తోనే నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు ఓ అధికారి పేర్కొనడం గమనార్హం. డిజైన్ మార్చినట్లయితే కొన్ని నిర్మాణాలను సైతం కూల్చివేసే అవకాశం ఉండటంతో ఆ సాహసం చేయలేకనో, లేదా ఇప్పట్లో ఆ పని అయ్యేది కాదనో వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది.



కొనసాగుతున్న రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు

రిటైనింగ్ వాల్ నిర్మాణాలపై సందేహాలు

నాలా ఆక్రమణకు గురికాకుండా మెట్రోపాలిటన్ నగరాల్లో నిర్మించినట్లు నాలాకు ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణం శరవేగం జరుపుతున్నారు. భారీ వర్షాలు కురిసినప్పుడు నాలా 100 ఫీట్ల వెడల్పుతో ప్రవహించేదని నాలా సమీప డివిజన్లలో నివసిస్తున్న వారు చెబుతుండగా, రిటైనింగ్ వాల్ మాత్రం 80 ఫీట్లకు కుదించి నిర్మాణం చేస్తున్నారని విమర్శలు వినిపిస్తోన్నాయి. 80ఫీట్లతో రిటైనింగ్ వాల్ నిర్మాణం చేయడాన్ని ముంపు బాధితులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. రిటైనింగ్ వాల్‌ను ఆనుకుని రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు చేపట్టే ప్రమాదం ఉందని ఒక పక్క ముంపు బాధితులు అంటుండగా..? రిటైనింగ్ వాల్ వెంబడి రెండు వైపులా మొక్కలు నాటడంతో పాటు నడిచేందుకు వీలుగా కొంత స్థలం ఉంటుందని అధికారులు పేర్కొనడం విశేషం. కాగా, ఎలాంటి రక్షణ లేకుండా వదిలిపెట్టిన స్థలాన్ని ఆక్రమణ దారులు ఎలా వదిలిపెడతారని బాధితుల నుంచి ఉత్పన్నమవుతున్న ప్రశ్న.

రాకపోకలకు అంతరాయం


నయీంనగర్ పెద్దమోరీ బ్రిడ్జితోపాటు రాజాజీనగర్‌లోని బ్రిడ్జి నిర్మాణాలు ఒకేసారి చేపట్టడంతో వాహనదారులు, స్థానిక ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. రెండు బ్రిడ్జిల నిర్మాణాలు చేపడుతున్నప్పుడు మూడు నెలలు రాకపోకలు బంద్ అని ప్రకటించిన జిల్లా యంత్రాంగం.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రజలను ముంపు నుంచి కాపాడాలనే సదుద్దేశంతో బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించినప్పటికీ ముంపు నుంచి బాధితులను కాపాడాననే క్రెడిట్‌ను దక్కించుకోవడానికి ఏకకాలంలో రెండు బ్రిడ్జిల నిర్మాణంను ప్రారంభించి ముందస్తు ప్రణాళికలు లేకుండా ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

45 రోజుల్లో అందుబాటులోకి తీసుకొస్తాం..
ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

నయీంనగర్ బ్రిడ్జిని చాలెంజ్‌గా తీసుకొని నిర్మాణ పనులు చేపట్టాం. నాలాకు ఇరువైపులా ఉన్న ప్రజలను ముంపు నుంచి కాపాడాటానికి పగలు, రాత్రి అనే తేడా లేకుండా పనులను శరవేగంగా చేయిస్తున్నాం. దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తున్నా.. ఇప్పటికే రెండు పిల్లర్లపై స్లాబ్ నిర్మాణం జరిగింది. క్యూరింగ్ కోసం సమయం పడుతుంది. ఎట్టి పరిస్థితుల్లో వర్షాలు పెరగకముందే నిర్మాణం పూర్తి చేసి తీరుతాం. నాలాకు ఇరువైపులా ఎలాంటి ఆక్రమణలకు తావు లేకుండా సైడ్ వాల్ నిర్మించేందుకు మునిసిపల్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖలకు బాధ్యతలను అప్పగించాం. హైదరాబాద్‌లోని కేబుల్ బ్రిడ్జి తరహాలో రూపొందించబోతున్నాం.



వాగ్దేవి కళాశాల వైపు స్లాబ్ పోయకుండా ఉన్న పిల్లర్లు



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

వరంగల్‌పై సీఎందీ నాదీ ఒకే విజన్!

- హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేయాలనేదే లక్ష్యం
- అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, ఎయిర్‌పోర్టు, రింగ్‌రోడ్డును పూర్తి చేస్తాం
- కాళోజీ కళాక్షేత్రం, వరంగల్ బస్టాండ్లను అందుబాటులోకి తీసుకొస్తాం
- 'కుడా' పరిధిని పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం
- త్వరలోనే అమల్లోకి కొత్త మాస్టర్ ప్లాన్
- పేదలకూ అందుబాటులో ఉండేలా కుడా లేఅవుట్ ప్లాట్లు
- ఎవరితో విబేధాల్లేవు.. కార్యకర్తలకు అండగా ఉంటా
- 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి

'వరంగల్ నగర అభివృద్ధి విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఏ విజన్‌తో ఉన్నారో.. నేనూ అదే విజన్‌తో ఉన్నా.. హైదరాబాద్‌కు దీటుగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు నగరానికి ఎంతో ప్రధానమైన అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, విమానాశ్రయం, రింగ్‌రోడ్డు నిర్మాణాల పూర్తి.. సాఫ్ట్‌వేర్ కంపెనీలను నెల కొల్పడమే లక్ష్యంగా పక్కా ప్రణాళికతో పని చేస్తాం. త్వరలోనే కొత్త మాస్టర్ ప్లాన్‌ను అమల్లోకి తెస్తాం. కాళోజీ కళాక్షేత్రాన్ని, కొంత్త బస్టాండ్ నిర్మాణాన్ని పూర్తి చేయిస్తాం. 'కుడా' ప్లాట్లను పేదలకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు కుడా పరిధిని విస్తరించేందుకు చర్యలు తీసుకుంటాం' అని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి స్పష్టం చేశారు. చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించి న ఆయన శనివారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలు వెల్లడించారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

7లో..



శివధూతిగా భద్రకాళి

శివధూతిగా భద్రకాళి

వరంగల్ కల్చరల్, జూలై 13: వరంగల్ మహా నగరంలో ప్రసిద్ధి గాంచిన భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో శాకంబరీ ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. శనివారానికి వేడుకలు ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. ఉదయం నిత్యాహ్నికం నిర్వహించిన అనంతరం ఉత్సవమూర్తికి ఇచ్ఛాశక్తి కాళీ క్రమాన్ని అనుసరించి ఉగ్రమాతగా అలంకరించారు. శోడశీ క్రమాన్ని అనుసరించి జ్ఞానశక్తిని శ్రీభద్రకాళి అమ్మవారిని శివధూతి మాతగా అలంకరించి పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఇండస్ట్రియల్ కారిడార్‌గా అభివృద్ధి చేసేందుకు కృషి

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- మడికొండలో వర్ధన్నపేట కాంగ్రెస్ నాయకుల ఆత్మీయ సన్మానం



మడికొండ సత్యసాయి కన్వెన్షన్‌లో జరిగిన సన్మాన సభలో మాట్లాడుతున్న ఎంపీ కడియం కావ్య

మడికొండ, జూలై 13: వరంగల్‌ను ఇండస్ట్రియల్ కారిడార్, ఎడ్యుకేషన్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు. మడికొండలోని సత్యసాయి కన్వెన్షన్‌లో శనివారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు అధ్యక్షతన కడియం కావ్య పరిచయ, ఆత్మీయ సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంపీని, ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ కావ్య మాట్లాడుతూ.. తనను ఓరుగల్లు నుంచి ఎర్రకోటకు పంపించేందుకు కృషి చేసిన ప్రతీఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. తనను అత్యధిక మెజారిటీతో గెలిపించిన వర్ధన్నపేట ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామగ్రామాన కాంగ్రెస్ జెండా ఎగరేసే విధంగా ప్రతీ కార్యకర్త సైనికుడి వలే పనిచేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో కాళ్లు విరిగిన నరేంద్రమోదీ.. నితీష్‌కుమార్, చంద్రబాబు చేతికర్రల సాయంతో నడుస్తున్నారని ఎద్దేవా చేశారు. రానున్నరోజుల్లో కేంద్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. వరంగల్ స్మార్ట్ సిటీ పనుల గడువు మరికొంతకాలం పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి కేంద్రాన్ని కోరడంతో గడువు పెరిగిందన్నారు. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు మాట్లాడుతూ.. వర్ధన్నపేట నియోజక వర్గంలో స్థల సేకరణ చేసి బీసీ, ఎస్సీ, ఎస్టీ ఇంటిగ్రేటెడ్ స్టడీ సర్కిల్ మంజూరు చేయిస్తానన్నారు. ఎంపీ కావ్య కేంద్ర మంత్రులను కలిసి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో మామునూర్ ఎయిర్‌పోర్టు పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ ఎంపీ పసునూరి దయాకర్, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర ఆయిల్ సీడ్స్ సంస్థ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రుపాషా, హనుమకొండ జిల్లా కిసాన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, వరంగల్ జిల్లా కిసాన్ అధ్యక్షుడు దేవేందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సారంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, నాయకులు వస్కుల శంకర్, కుర్ల మోహన్, బిల్ల రవీందర్, బైరి లింగమూర్తి, వస్కుల నాగరాజు , కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ కోసం ప్రశ్నిస్తా..
- ఎంపీ కడియం కావ్య

వివరాలు 7లో..



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

ఇతర మతాలను గౌరవిస్తూ పండుగలు జరుపుకోవాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, జూలై 13: ఇతర మతాలను గౌరవిస్తూ పండుగలు జరుపుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. మొహరం, తొలి ఏకాదశి పండుగలు సమీపిస్తున్న సందర్భంగా శనివారం హనుమకొండలోని కమిషనర్ కార్యాలయంలో సెంట్రల్ జోన్ పరిధిలోని శాంత పరిరక్షణ కమిటీలతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాలకు చెందిన మత పెద్దలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు. సీపీ మాట్లాడుతూ.. సోదరభావంతో పండుగలు జరుపుకోవడం ఓరుగల్లు ప్రజల ప్రత్యేకత అన్నారు. ఇతర మతాలను గౌరవిస్తూ పండుగలను జరుపుకోవాలని ఆయన సూచించారు. పిల్లలు గంజాయికి బానిసలు కాకుండా తల్లి దండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గంజాయి నిర్మూలనకు సహకారం అందించాలని సీపీ సూచించారు. సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, అదనపు డీసీపీ రవి, ఏసీ పీలు దేవేందర్ రెడ్డి, నందిరాం నాయక్, తిరుమల్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డు మృతి

డ్యూటీకి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీ

మామునూరులో విషాదం



సుధాకర్(ఫైల్)

శంభునిపేట, జూలై 13: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న హోం గార్డును వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శనివారం మామునూరులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. మామునూరుకు చెందిన వడ్డేపల్లి సుధాకర్ (55) మామునూరు ఫోర్త్ బెటాలియన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగా విధులకు హాజరయ్యేందుకు శనివారం ఉదయం 4.30గంటలకు మామునూరులోని తన ఇంటి నుంచి బెటాలియన్‌కు నడుచుకుంటూ బయలుదేరాడు. మామునూరు మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాల వద్ద సుధాకర్‌ను వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహం గుర్తు పట్టలేనంతగా నుజ్జునుజ్జయింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఘటనా స్థలంలో దొరికిన ఆధారాలతో మృతుడు సుధాకర్‌గా గుర్తించి, కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. సుధాకర్‌కు భార్య కోమల, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల్ని పరిష్కరించండి

● కోతులు, విష పరుగులు రాకుండా చూడాలి: కలెక్టర్ ● ఇల్లంద కేజీబీవీ, వర్ధన్నపేట మునిసిపాలిటీ ఆకస్మిక తనిఖీ



వర్ధన్నపేట మునిసిపాలిటీ, ఇల్లందు కేజీబీవీలో తనిఖీ చేస్తున్న కలెక్టర్

వర్ధన్నపేట రూరల్, జూలై 13 : కేజీబీవీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ సత్య శారద సూచించారు. శనివారం మండలంలోని ఇల్లందు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. కేజీబీవీ పీవో కరుణశ్రీ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్ సమస్యలు, హాస్టల్ ఆవరణ పరిస్థితులు, సోలార్, మౌలిక వసతులతోపాటు ఫర్నిచర్, బియ్యం రవాణా, బిల్లుల చెల్లింపుల జాప్యాన్ని వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలపై నివేదిక తయారు చేసి ఇవ్వాలన్నారు. డీఈవో వాసంతి దృష్టికి తీసుకెళ్లి సమష్టిగా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఎన్‌జీవో, దాతల సహకారం తీసుకోవాలని సూచించారు. కోతుల బెడద నుంచి విద్యార్థులను కాపాడడంతోపాటు విష పురుగులు హాస్టల్‌లోకి ప్రవేశించకుండా జాగ్రత్తలు చేప ట్టాలన్నారు. ప్రహరీచుట్టూ ఉన్న ఫెన్సింగ్‌కు సోలార్ సిస్టంను పునరుద్ధరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మార్వో విజయ్ సాగర్, ఆర్ఐ కృష్ణ, కార్యదర్శి రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాపాలన పకబ్బందీగా అమలు చేయాలి..

వర్ధన్నపేట : ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాల అమలులో భాగంగా చేపట్టిన ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని, గృహజ్యోతి పథకంలో భాగంగా విద్యుత్, గ్యాస్ సంబంధిత సమస్యలపై వచ్చే సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద సిబ్బందిని ఆదేశించారు. శనివారం వర్ధన్నపేట పురపాలక సంఘంలో ప్రజాపాలన దరఖాస్తు కౌంటర్‌ను తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ మునిసిపాలిటీలోని 12వార్డుల్లో ప్రజాపాలన సమస్యలపై కౌంటర్‌కు వచ్చే ప్రతీ దరఖాస్తుదారుడి సమస్యను పరిష్కరించాలన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్న క్రమంలో ఏర్పడిన సమస్యలతో పలు ప్రభుత్వ పథకాలు వర్తించడం లేదని, ప్రధానంగా గ్యాస్ సిలిండర్ సబ్సిడీ జమకాక పోవడం, 200 యూనిట్లలోపు కరెంటు వినియోగం జరిగినప్పటికీ ఉచిత బిల్లు అమలు కాక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

పూర్తి సమాచారంతో వచ్చిన ప్రతీ లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాలు వర్తించేలా సెక్షన్ అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. అనంతరం వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలు, పారిశుధ్యం, మంచినీటి సమస్యలపై చైర్‌పర్సన్, కమిషనర్‌లతో చర్చించారు. వనమహోత్సవంలో భాగంగా ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ అంగోత్ అరుణ, కమిషనర్ జోనా, తహసీల్దార్ విజయసాగర్, మునిసిపల్ మేనేజర్ కొలిపాక కిరణ్, శంకర్, ఐలోని పాల్గొన్నారు.

ముదిరాజ్ కులస్థులను బీసీ ఏలో చేర్చాలి

ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్

హనుమకొండ చౌరస్తా, జూలై 13: రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజ్ కులస్తుల అభివృద్ధికి కృషి చేయడంతో పాటు బీసీ ఏలో చేర్చాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ కోరారు. హనుమకొండ 10వ డివిజన్ మచిలీబజార్‌లోని తెలంగాణ ముదిరాజ్ మహాసభ కమ్యూనిటీ హాల్‌లో శనివారం జిల్లా ప్రధాన కార్యదర్శి పులి రజనీకాంత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో అశోక్ పాల్గొని ముందుగా మహాసభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ పిలుపు మేరకు బీసీ డీలో ఉన్న ముదిరాజ్‌లను బీసీ ఏలోకి చేర్చాలనే నినాదంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ముదిరాజ్ కులస్తుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 15నుంచి 20వరకు జిల్లాలోని రెవెన్యూ అధికారులను కలిసి వినతిపత్రాలు అందించే కార్యక్రమం నిర్వహించనున్నట్లు అశోక్ తెలిపారు.

పులి రజనీకాంత్ మాట్లాడుతూ.. తెలంగాణలో అత్యంత ప్రాచీన, అధిక జనాభా గల కులమైన ముదిరాజ్, తెనుగోళ్లు, ముత్తరాసి అయిన తాము.. సమాజంలో అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నామన్నారు. ముదిరాజ్ అభివృద్ధి కోసం కో-అపరేటివ్ సొసైటీ లిమిటెడ్‌ను ఏర్పాటు చేసి యేటా రూ.1000కోట్ల నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. మత్స్యశాఖలోని సొసైటీలకు ఎన్నికలు జరపాలని, అదే విధంగా ఆసరా పింఛన్ సౌకర్యాలను కల్పించాలని, ప్రత్యేక గురుకుల పాఠశాలలు ఏర్పాటుతో పాటు ఉచితంగా చేప పిల్లల పంపిణీ పథకాన్ని కొనసాగించాలన్నారు. అధికార పార్టీలో ఎమ్మెల్యేలుగా ఉన్న ముదిరాజ్ కుల బంధువులకు మంత్రివర్గంలో స్థానం కల్పించడంతో పాటు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని రజనీకాంత్ కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ సభ్యులు చొప్పరి సోమయ్య, ఎన్ఆర్ఐ రాజ్‌కుమార్, పిట్టల సత్యనారాయణ, రవికుమార్, మహేందర్, బయ్య శోభన్, పులి మధు, కుమారస్వామి, సారంగపాణి, సాంబమూర్తి, విక్రమ్, బుచ్చిరాజు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



ముదిరాజ్‌ల సమస్యలను పరిష్కంచాలని కోరుతూ ఏర్పాటు చేసిన వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ముదిరాజ్ కులస్థులు

రూ.2లక్షల గుట్కా పట్టివేత


పట్టుకున్న గుట్కాతో పోలీసులు

వరంగల్ క్రైం, జూలై 13: వరంగల్ ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేబీహెచ్ఎస్ కాలనీలో రూ.2లక్షల విలువైన గుట్కాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. కాలనీలో నాగరాజు అనే వ్యక్తి వద్ద గుట్కా నిల్వలు ఉన్నట్లు సమాచారం అందుకుని టాస్క్‌ఫోర్స్ సీఐ రవికుమార్ తన సిబ్బందితో కలిసి శనివారం దాడులు చేశారు. దాడిలో నిషేధిత గుట్కాను స్వాధీనం చేసుకుని నాగరాజును అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం ఇంతేజార్‌గంజ్ పోలీసులకు అప్పగించారు.

కేయూలో సైన్స్ పీజీ కోర్సుల తరగతులు షురూ..

కేయూ క్యాంపస్, జూలై 13: కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం పీజీ సైన్స్ కోర్సుల మొదటి సెమిస్టర్ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. జంతుశాస్త్ర విభాగం సెమినార్ హాల్‌లో జరిగిన ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి మాట్లాడారు. కేయూలో ఈ ఏడాది దూరవిద్య కేంద్రంలో పీజీ కోర్సుల్లో అడ్మిషన్లు బాగా పెరిగాయని చెప్పారు. జువాలజీ, బాటనీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, గణితశాస్త్రం కోర్సుల్లో స్టడీ మెటీరియల్‌ను అందచేస్తామని చెప్పారు. విద్యార్థులు తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం మాట్లాడుతూ.. థియరీ క్లాస్‌లకు విద్యార్థులకు రెగ్యులర్‌గా హాజరుకావాలని, తర్వాత ప్రాక్టికల్స్ క్లాసులు నిర్వహిస్తామని చెప్పారు. వర్సిటీలో మొదటిదఫాగా యూజీసీ డెబ్ ఆదేశాల మేరకు సెమిస్టర్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఎస్డీఎల్‌సీఈ సైన్స్ కోర్సుల సహ సంచాలకుడు డాక్టర్ వెంకటగోపీనాథ్ మాట్లాడుతూ.. రెగ్యులర్ కోర్సులకు దీటుగా దూరవిద్య విధానంలో తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ విభాగాల అధిపులు డాక్టర్ భారవీశర్మ, డాక్టర్ మంజుల, డాక్టర్ ఇస్తారీ, డాక్టర్ లలితకుమారి, డాక్టర్ ముస్తాఫా, డాక్టర్ జ్యోతి, డాక్టర్ హన్మంతు తదితర విద్యార్థులు పాల్గొన్నారు.


హాజరైన ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ఇతర అధ్యాపకులు

వరంగల్‌పై సీఎంది నాదీ ఒకే విజన్

హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేయాలనేదే లక్ష్యం : 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి

ఇంటర్వ్యూ

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌ను అభివృద్ధి చేయాలనే సీఎం రేవంత్‌రెడ్డి విజనే తన విజన్‌గా పని చేస్తానని, ఎయిర్‌పోర్టు, నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీని తీసుకరావటంతో పాటు రింగ్ రోడ్, సాఫ్ట్‌వేర్ కంపెనీలను నెలకొల్పడం లక్ష్యంగా ప్రణాళిక రూపొందిస్తున్నామని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ (కుడా) నూతన చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి స్పష్టం చేశారు. శనివారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన కుడా అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను వెల్లడించారు. పేదలకు కుడా ప్లాట్లను అందుబాటులోకి తీసుకరాడటంతో పాటు కూడా పరిధిని విస్తరించటం.. కాళోజీ కళాక్షేత్రం, వరంగల్ బస్టాండ్ నిర్మాణం, నగరంలో జంక్షన్‌ల అభివృద్దే లక్ష్యంగా పని చేస్తానన్నారు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి: కుడా చైర్మన్‌గా ఎంపిక కావటంపై మీ స్పందన?

ఇనుగాల వెంకట్రామిరెడ్డి: కాంగ్రెస్‌లో ఓ సాధారణ కార్యకర్తగా.. పార్టీ ఏ కార్యక్రమం ఇచ్చినా విజయవంతంగా పని చేశా. 2014 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయినా ప్రజల్లోనే ఉన్నా. 2018, 2023లో కొన్ని కారణాల వల్ల పార్టీ టికెట్ ఇవ్వకపోయినా పార్టీ అభ్యున్నతికి కృషి చేశా. రేవంత్‌రెడ్డి పాదయాత్రతో పాటు ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో శక్తివంచన లేకుండా కృషి చేశా. ఇవన్నీ సీఎం రేవంత్‌రెడ్డి గుర్తించి కూడా చైర్మన్ పదవిని అప్పగించారు. ఈ రెండేళ్ల కాలంలో వరంగల్ కుడా పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు కాంగ్రెస్ కార్యకర్తల కష్టాసుఖాల్లో పాలుపంచుకుంటా. ప్రజలకు సేవ చేసేందుకు కూడా చైర్మన్ పదవి దక్కింది. తప్పకుండా సీఎం సహకారంతో కుడా పరిధిలో నా మార్కు అభివృద్ధి ఉండేలా పని చేస్తా.

ఆంధ్రజ్యోతి: కుడా చైర్మన్‌గా మీ విజన్ ఏంటి?

వెంకట్రామిరెడ్డి: సీఎం రేవంత్‌రెడ్డికి వరంగల్‌ను హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేయాలనే పట్టు దలతో ఉన్నారు. ఆయన ఏ విజన్‌తో ఉన్నారో నేనూ అదే విజన్‌గా పని చేస్తా. ప్రధానంగా వరంగల్‌కు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పూర్తి చేయటం లక్ష్యంగా పెట్టుకున్నాం. అలాగే ఎయిర్‌పోర్టుకు దారిని విస్తరించడంతో పాటు త్వరలోనే వరంగల్ మామునూరు నుంచి విమానాలు ఎగిరేలా పని చేస్తున్నాం. ఇప్పటికే చాలా వరకు పూర్తి అయినా రింగ్‌రోడ్డు పనులు ఇంకో ఐదారు కిలో మీటర్ల వరకు మిగిలి ఉంది. దీనికి కావాల్సిన రూ.300కోట్ల వరకు సీఎం మంజూరుకు హామీ ఇచ్చారు. త్వరలోనే రింగ్‌రోడ్డును పూర్తి చేస్తాం. ప్రస్తుతం కూడా ఆధ్వరంలో మూడు వెంచర్లున్నాయి. వాటిలో పేదలు ప్లాట్లు కొనేలా అభివృద్ధి చేస్తున్నాం. నగరం చుట్టూ అనధికారిక ప్లాట్లు భారీగా ఏర్పాటు చేశారు. వాటిని గుర్తించి లేఅవుట్‌లుగా మార్చేలా ప్రయత్నాలు చేస్తాం. నాన్ లేఅవుట్ ప్లాట్లలో ప్లాట్ కొనుగోలు చేయకుండా ప్రజల్లో అవగాహన తీసుకవస్తాం. ఫామ్ ల్యాండ్ పేరుతో జరుగుతున్న భూక్రయ విక్రయాలపై దృష్టి పెడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: హైదరాబాద్‌కు దీటుగా అంటే ఎలాంటి అభివృద్ధి చేస్తారు?

వెంకట్రామిరెడ్డి: హైదరాబాద్ నగరంలో ఉన్న సౌకర్యాలు వరంగల్ వాసులకు తీసుకరావటం ప్రధానం. అలాగే వరంగల్‌లో ఇంటర్నేషనల్ స్టేడియం ఏర్పాటుకు పలు సంస్థలు ముందుకు వస్తున్నాయి. దీన్ని పూర్తి చేస్తే అంతర్జాతీయ క్రీడలు ఇక్కడే నిర్వహిస్తారు. 50 ఎకరాల్లో కొత్తగా స్టేడియం ఏర్పాటు చేసి వరంగల్‌ను స్పోర్ట్స్ సిటీగా అభివృద్ధి చేయాలనేది నా లక్ష్యం. అలాగే మెడికల్ హబ్‌గా వరంగల్‌ను హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేస్తాం. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రతో పాటు చుట్టు పక్కల జిల్లాల నుంచి ప్రజలు వైద్యం కోసం వరంగల్‌కు వచ్చేలా సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. ఇందుకు కావాల్సిన భూమిని కూడా సమకూర్చుతుంది. ఐటీ కంపెనీలను వరంగల్‌కు తీసుక వచ్చేందుకు దృష్టి పెడుతున్నాం. మడికొండ ఏరియాలో డంపింగ్ యార్డు నుంచి చెత్త ద్వారా విద్యుత్ ఉత్పత్తికి ప్లాన్ చేస్తున్నాం. దీంతో ఐటీ కంపెనీల ఏర్పాటుకు చాల వరకు ఆటంకాలు లేకుండా పోతుంది.

ఆంధ్రజ్యోతి: కుడా చేపట్టిన పనుల్లో పురోగతి ఎలా ఉంది?

వెంకట్రామిరెడ్డి: కుడా ఆధ్వర్యంలో ప్రజలకు దీర్ఘకాలికంగా ప్రయోజనం ఉండే పనులపై దృష్టి పెట్టాం. గత ప్రభుత్వం అంచనాలు లేకుండా కొన్ని పనులు చేపట్టి మధ్యలోనే వదిలేసింది. వాటిలో ప్రధానంగా బాలసముద్రంలో కాళోజీ కళాక్షేత్రాన్ని రూ.90కోట్లతో చేపట్టి నిధులు లేక మధ్యలోనే వదిలేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో కాళోజీ కళాక్షేత్రాన్ని సెప్టెంబరు 9వ తేదీలోపు పూర్తి చేసేలా పనుల్లో వేగం పెంచాం. ఇప్పటి వరకు 80శాతం పనులు చేశాం. అలాగే వరంగల్ బస్టాండ్‌కు రూ.250కోట్లు కేటాయించాం. మొదటి విడతలో రూ.125 కోట్లతో చేపట్టే పనులను కుడా ఆధ్వర్యంలో ప్రారంభించారం. మోడల్ బస్టాండ్‌గా అభివృద్ధి చేస్తాం. వరంగల్ ఓ సిటీ ఏరియాలో కుడా 8 ఎకరాల వరకు భూమి ఉంది. ఈ భూమిని ఏలా అభివృద్ధి చేయాలో స్థానిక మంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. వరంగల్ మహానగరంలో జంక్షన్ల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి పెడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: కుడా పరిధి పెంచటం.. మాస్టర్ ప్లాన్‌పై మీ వైఖరి?

వెంకట్రామిరెడ్డి: కుడా పరిధిని కచ్చితంగా పెంచుతాం. ప్రస్తుతం కుడా పరిధిలో 180 గ్రామాలున్నాయి. సుమారు 25కిలో మీటర్ల వరకే కుడా విస్తరించి ఉంది. దీన్ని ఎంత మేర పెంచాలనే దానిపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల అభిప్రాయాలను తీసుకుని నిర్ణయం తీసుకుంటాం. గత ప్రభుత్వం తీసుకవచ్చిన మాస్టర్ ప్లాన్‌ను మారుస్తున్నాం. సీఎం ఆదేశాల మేరకు 2050 వరకు ఉపయోగపడేలా కొత్త మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తున్నాం. మరో మూడు, నాలుగు నెలల్లో దాన్ని అమలు చేస్తాం.

ఆంధ్రజ్యోతి: వ్యాపారంలో స్థిరపడిన మీరు రాజకీయాల్లోకి రావాలని ఎందుకనుకున్నారు?

వెంకట్రామిరెడ్డి: మా కుటుంబం వ్యాపార పరంగా స్థిరపడింది. మా ఒక్క కూతురూ కెనడాలో ఉన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు ఉపాధ్యక్షుడిగా, దక్కన్ క్రానికల్ సీఈవోగా పని చేశా. 2012లో పరకాల ఎమ్మెల్యే కొండా సురేఖ వైసీపీలోకి వెళ్లటంతో నాటి సీఎం కిరణ్‌కుమార్ రెడ్డితో ఉన్న సత్సంబంధాలతో ఆయన పరకాల రాజకీయాల్లోకి పంపారు. ఆ తరువాత సొంత గడ్డపై ప్రజలకు సేవల చేయాలనే లక్ష్యంతో 2013 సహకార ఎన్నికల్లో పోటీ చేశా. ఇక ఖమ్మం శారద కాలేజీలో స్టూడెంట్ ఉన్నప్పుడు లీడర్‌గా పని చేసిన అనుభవం ఉండటంతో రాజకీయాల్లో సులభంగానే నెట్టుకవచ్చాను. 2023లో కూడా కొత్తవారికి అవకాశం ఇవ్వాలని అధిష్ఠానం ఆదేశిస్తే పోటీ నుంచి తప్పుకున్నా. వచ్చే అసెంబ్లీ ఎన్నికల వరకు నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుంది. ఆ సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి తీసుకునే నిర్ణయంపై పోటీ గురించి ఆలోచిస్తా. పరకాల ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, మంత్రి సురేఖతో సహ ఎవరితోనూ ఎలాంటి విబేధాలు లేవు. అందరితో కలిసి పని చేస్తా. ఈ రోజు కుడా కుర్చీలో కూర్చున్నానంటే అది కేవలం కార్యకర్తల కష్టఫలమే. వారికి అండగా ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా.



రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ కోసం ప్రశ్నిస్తా..

● వరంగల్ ఎంపీ కడియం కావ్య ● రైల్వే సమస్యలపై టీ రైల్వే జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కడియం కావ్య

కాజీపేట, జూలై 13: కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ సాధనకోసం కేంద్ర ప్రభుత్వాన్ని ఎన్నిసార్లైనా ప్రశ్నిస్తానని, డివిజన్ సాధనే లక్ష్యం పని చేస్తేనే తన రాజకీయ జీవితానికి సార్థకం అవుతుందని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. రైల్వే సమస్యల పరిష్కారానికి తెలంగాణ రైల్వేఎంప్లాయీస్ జేఏసీలో తనకు కూడా సభ్యత్వం ఇవ్వాలన్నారు. కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో తెలంగాణ రైల్వే ఎంప్లాయీస్ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం రైల్వే సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది.. జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా ఎంపీ కడియం కావ్య పాల్గొని మాట్లాడారు. వరంగల్ ఎంపీగా ప్రతీ సమస్యపై పోరాటం చేస్తానన్నారు. ఒక ఏడాదిలో పలు సమస్యలపై పార్లమెంట్‌లో పదిసార్లు మాట్లాడిన కడియం శ్రీహరి బిడ్డగా సమస్యల పరిష్కారానికి పార్లమెంట్‌లో తనగొంతు వినిపిస్తానని ఉద్వేగంగా ప్రసంగించారు. కాజీపేటలో ప్లాట్‌ఫారాల విస్తరణ, లోకోపైలెట్‌ల సమస్యలు, రైల్వేలో ప్రైవేటీకరణ అడ్డుకోవడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఆర్ఎస్ఎస్ ముసుగులో ప్రధాని మోదీ రిజర్వేషన్‌లు ఎత్తివేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అంబేద్కర్ అన్ని వర్గాలకు న్యాయం చేశారని గుర్తుచేశారు. రాహుల్ గాంధీకి అన్ని సమస్యలపై అవగాహన ఉందన్నారు. రైల్వే బడ్జెట్‌లో కాజీపేటకు వాటా వచ్చే వరకు నిరంతర పోరాటం చేస్తానన్నారు. సమస్యల పరిష్కారానికి ఎవరికీ భయపడే ప్రసక్తేలేదన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. కాజీపేటకు రైల్వేపరంగా కేంద్రం నుంచి న్యాయం జరగాలంటే తెలంగాణ ఎంపీలతో టీరైల్వే జేఏసీ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. రైల్వేలో ఉద్యోగాలు మన పిల్లలకు దక్కాలంటే రైల్వే పోటీ పరీక్షల్లో అర్హత సాధించే విధంగా చదవాలన్నారు. ఆర్ఆర్‌బీ, ఆర్ఆర్‌సీ పరిధిలోనే పరీక్షలు నిర్వహించాలన్నారు. రైల్వే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిందేనన్నారు. రైల్వేపరంగా కాజీపేటకు రావాల్సిన విషయాలపై ప్రత్యేక నివేదికను రూపొందించాలని జేఏసీ నాయకులకు సూచించారు. కాజీపేటలో అదనపు ఆర్వోబీని ఆరునెలల్లో అందుబాటులోకి తెస్తామన్నారు. ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. రైల్వే వ్యాగన్ పరిశ్రమలో భూమి కోల్పోయిన రైతులకు సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి రూ.5కోట్ల నష్టపరిహారం ఇప్పించానని చెప్పారు. పెన్షనర్ల కార్యాలయానికి స్థలం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.

అంతకు ముందు మజ్దూర్ యూనియన్ డివిజనల్ సెక్రటరీ పిల్లలమర్రి రవీందర్, జోనల్ అధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్, ఆలిండియా ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడు బి.వీరన్న, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. సంగమయ్య, కృష్ణమూర్తి, సంఘ్ సీడబ్ల్యూసీ మెంబర్ సీహెచ్ మరళి, సంఘ్ డివిజనల్ అధ్యక్షుడు కొత్త మురళి, రైల్వే జేఏసీ చైర్మన్ కొండ్ర నర్సింగరావు, కోశాధికారి సీహెచ్ తిరుపతి, ఆల్ బ్రాంచ్ కో-ఆర్డినేటర్ నాయిని సదానందం, స్థానిక కార్పొరేటర్‌లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీతోపాటు పలువురు నాయకులు రైల్వే సమస్యలపై చర్చించి రైల్వే పరిశ్రమల సాధన, తదితర విషయాలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు. సుమారు మూడు గంటలపాటు జరిగిన ఈ రౌండ్‌టేబుల్ చర్చావేదికలో రైల్వే కార్మికులు, కాంగ్రెస్ నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఏటూరునాగారంలో ఘోర రోడ్డు ప్రమాదం

గేదె కళేబరాన్ని తప్పించబోయి కంటైనర్‌ను ఢీకొట్టిన ఆటో

దంపతులు, కూతురు సహా ఆటోడ్రైవర్ దుర్మరణం

మరొకరికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన ఆటో

ఏటూరునాగారం రూరల్, జూలై 13 : రోడ్డుకు అడ్డంగా ఉన్న గేదె కళాబరాన్ని తప్పించబోయి కంటైనర్‌ను ఆటో ఢీ కొట్టడంతో దంపతులతోపాటు వారి కూతురు, ఆటోడ్రైవర్ మృతిచెందిన సంఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో శనివారం రాత్రి జరిగింది. ఆటోడ్రైవర్‌కు తోడుగా వచ్చిన మరో వ్యక్తి గాయాలపాలయ్యాడు. కూతురిని బస్సు ఎక్కించేందుకు ఆ దంపతులు తమ గ్రామానికి చెందిన ఓ ఆటోను కిరాయికి తీసుకుని బయల్దేరిన క్రమంలో ఈ దుర్ఘటన జరిగింది.

ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రానికి చెందిన కాకర్లపూడి సత్యనారాయణరాజు(72), కాకర్లపూడి సత్యవతి(65) దంపతులు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తునిలో నివాసముంటున్న తన కూతురు సాగిరాజు అనిత (45)ను ఆమె ఊరికి పంపించేందుకు వాజేడు నుంచి ఏటూరునాగారంనకు శనివారం రాత్రి బయల్దేరారు. ఈ క్రమంలో వాజేడుకు చెందిన తలాండి నాగరాజుకు చెందిన ఆటోను కిరాయికి మాట్లాడుకోగా.. ఆటోలో వీరి ముగ్గురితో పాటు డ్రైవర్ నాగరాజుకు తోడుగా ఉండేందుకు అంజిరెడ్డి అనే మరోవ్యక్తి కూడా వచ్చాడు. వారి ఆటో ఏటూరునాగారం వస్తున్న క్రమంలో 163వ జాతీయరహదారిపై హైస్ట్రీట్ సమీపంలో రోడ్డుపై ఓ పాడిగేదే మరణించి ఉంది. ఆ కళేబరాన్ని తప్పించబోయి ఆటో ఎదురుగా వాజేడు వైపు వెళ్తున్న కంటైనర్‌ను ఢీకొట్టి ఆటో బోల్తా కొట్టింది. దీంతో కాకర్లపూడి సత్యనారాయణరాజు, కాకర్లపూడి సత్యవతితో పాటు డ్రైవర్ నాగారాజు అక్కడికక్కడే మృతి చెందగా సాగిరాజు అనిత, అంజిరెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే వారిని తొలుత మండలకేంద్రంలోని సామాజిక ఆసుపత్రికి, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స అందిస్తున్న క్రమంలో మృతి చెందింది.

సత్యనారాయణరాజు, సత్య వతి, నాగరాజు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ములుగు జిల్లా ఆసుపత్రికి తర లించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. ఇదిలా ఉంటే ప్రమాదం అనంతరం కంటైనర్ డ్రైవర్ వాహనంతో సహ పారితుండగా వాజేడు మండలం జగన్నాథపురానికి చెందిన వారు ఆ కంటైనర్‌ను అడ్డుకోగా వాహనా న్ని వదిలేసి డ్రైవర్ పరారయ్యాడు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన అనిత


చికిత్స పొందుతున్న అంజిరెడ్డి

మోసాలకు పాల్పడిన ముగ్గురు అరెస్టు

మట్టెవాడ, జూలై 13: క్రిప్టో కరెన్సీలోకి మార్చి లాభాలు ఇప్పిస్తామని మోసాలకు పాల్పడుతున్న ఢిల్లీకి చెందిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు మట్టెవాడ సీఐ గోపి తెలిపారు. వరంగల్ బ్యాంకు కాలనీకి చెందిన వ్యాపారవేత్తను కొంతమంది ఢిల్లీ నుంచి వాట్సప్‌లో ఫోన్ చేస్తూ ఐదు కోట్లు పెట్టుబడి పెడితే రూ.15 కోట్లు వస్తాయని నమ్మించారన్నారు. సదరు వ్యాపారి వారి మాటలు నమ్మి హైదరాబాద్‌లోని ఓ ఇంటిలో ఐదు కోట్లు ఇవ్వగా, ఆ ఇంట్లో వ్యక్తి వ్యాపారికి ఇచ్చిన ఐదు కోట్ల రూపాయలను హవాలా రూపంలో ఢిల్లీకి పంపినట్టు పేర్కొన్నారు. తర్వాత సదరు వ్యాపారికి అకౌంట్లో ఎలాంటి డబ్బులు జమ కాకపోవడంతో మోసపోయినట్టు గ్రహించి మట్టెవాడ పోలీసు స్టేషన్‌లో మేలో ఫిర్యాదు చేశాడన్నారు. విచారణ చేపట్టిన పోలీసులు ఒక నేరస్తుడి ద్వారా ఇంకొక నేరస్తున్ని అదుపులోకి తీసుకొని ఢిల్లీలో ఉండే నిందితులు అమిత్ సింగ్, కరందీప్ సింగ్, సచిన్ శుక్లాలను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



స్వామివారికి పూజలు చేస్తున్న ఇనగాల

కొమ్మాలలో 'కుడా' చైర్మన్ పూజలు

గీసుగొండ, జూలై 13: కుడా చైర్మన్‌గా బాధ్యతల తీసుకున్న ఇనగాల వెంకట్రాం రెడ్డి కొమ్మాల శ్రీలక్ష్మీనరసింహస్వామిని శనివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకట్రాంరెడ్డికి ఆలయ మర్యాదలతో అర్చకులు, నాయకులు స్వాగతం పలికారు. అనంతరం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో మొక్కలు ఆయన క్కొలు నాటారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి భీమగాని సౌజన్య, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, అధికార ప్రతినిధి చాడా కొమురారెడ్డి, సాయి, రమేష్, అర్చకులు రామాచార్యులు, విష్ణు పాల్గొన్నారు.

కుడా చైర్మన్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు

సంగెం, జూలై 13: ఇటీవల కుడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డిని సంగెం మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం హనుమకొండలో మండలానికి చెందిన నాయకులు మునుకుంట్ల కోటేశ్వర్,మోహన్, నల్లతీగల రవి, పులి సాంబయ్య కలిశారు.

రేవూరికి మంత్రి పదవి రావాలని పూజలు



రేవూరికి మంత్రి పదవి రావాలని పూజలు చేస్తున్న నాయకులు

గీసుగొండ, జూలై 13: పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డికి మంత్రి రావాలని కాంగ్రెస్ మండల నాయకులు శనివారం కొమ్మాల శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అధికార ప్రతినిధి చాడా కొమురారెడ్డి మాట్లాడుతూ వరంగల్ పార్లమెంటు ఇన్‌చార్జీగా ఉండి అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించిన ఘనత రేవూరికి దక్కిందన్నారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజలకు సేవలు అందించటంతోపాటు నిస్వార్థ రాజకీయ నాయకుడిగా రేవూరికి గుర్తింపు ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు మణిగోపాల్, సాయిరి ప్రభాకర్, దూల వెంకటేశ్వర్లు, కూస రమేష్, నల్ల సురేష్, వీరన్న, రవిందర్ రెడ్డి, నరేందర్, శ్రీనివాస్, రవి,రమేష్, వేణు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్ రికవరీ



బాధితులకు సెల్‌ఫోన్స్ అందజేస్తున్న సీఐ

మట్టెవాడ, జూలై 13: పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి 14 మొబైల్ ఫోన్‌లను బాధితులకు శనివారం అందజేసినట్లు మట్టెవాడ సీఐ తుమ్మ గోపి తెలిపారు. ఇప్పటి వరకు మట్టెవాడ పోలీసు స్టేషన్ పరిధిలో 80 ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు తెలిపారు.

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థికసాయం

ఖిలావరంగల్, జూలై 13: నిరుపేద కుటుంబానికి చెందిన కనకలక్ష్మి కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకుడు, వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ సంయుక్త కార్యదర్శి సాగర్ల శ్రీనివాస్ శనివారం ఆర్థికసాయం అందించారు. పడమరకోటకు కొండా కనకలక్ష్మి అనారోగ్యం విషయమై స్థానికులతో తెలుసుకొని రూ.3,000 అందించారు. కార్యక్రమంలో నాయకులు రావుల రాజేష్, వంగ దయాకర్, వడిచర్ల శంకర్, మనోజ్, పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతూ ఆత్మహత్య



సునీల్ కుమార్ (ఫైల్)

గిర్మాజీపేట, జూలై 13: అనారోగ్యంతో బాధపడుతూ ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం వరంగల్‌లో చోటుచేసుకుంది. వరంగల్ జీఆర్‌పీ సీఐ జి.నరేష్ కథనం ప్రకారం. శివనగర్‌కు చెందిన తాటికొండ సునీల్ కుమార్ (52) ప్రయివేట్ అకౌంటెంట్‌గా పనిచేస్తు తల్లిదండ్రులు, భార్య, పిల్లలను పోషించుకుంటున్నాడు. అతిగా గుట్కాలు, మద్యం తాగడంతో అనారోగ్యానికి గురయ్యాడు. ఇన్‌ఫెక్షన్ కారణంగా ఒక కన్ను చూపును పూర్తిగా కోల్పోగా, మరో కంటి చూపు క్షీణిస్తుండటంతో హైదరాబాద్‌లో వైద్య పరీక్షలు చేయించుకున్నాడు. జీవితాంతం మందులు వాడాలని వైద్యులు సూచించారు. శనివారం మధ్యాహ్నం ఇంటినుంచి బయటకువచ్చిన సునీల్‌కుమార్ పోతననగర్ జంక్షన్ సమీపంలో రఫ్తీ సాగర్ ఎక్స్‌ప్రెస్ కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ జి.సుదర్శన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వం, ఎమ్మెల్యేపై
పెద్ది వ్యాఖ్యలు సరికాదు

చెన్నారావుపేట, జూలై 13 : పదహారు చింతల్ తండాలో జరిగిన జంట హత్య కేసుపై ఎమ్మెల్యే మాధవరెడ్డి,ప్రభుత్వంపై అనుచితమైన వాఖ్యలను చేయడం మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి తగదని కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు భూక్య మోహన్‌నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేఖరులతో ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన సంఘటనలు మాజీ ఎమ్మెల్యే గుర్తుకు తేచ్చుకోవాలన్నారు. ప్రభుత్వపరంగా బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే మాధవరెడ్డి అండగాఉంటారన్నారు.

హనుమకొండ, వరంగల్ కలిపి ఒకే జిల్లా చేయాలి

పౌర సభలో ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ



పౌర సభలో మాట్లాడుతున్న వెంకటనారాయణ

వరంగల్ చౌరస్తా, జూలై 13: వరంగల్, హనుమకొండ జిల్లాలను వరంగల్ జిల్లా ఏర్పాటు చేసిన అభివృద్ధి చేయాలని ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం వరంగల్‌లోని ఓ హోటల్‌లో ఉమ్మడి జిల్లా పౌర సభను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కూరపాటి మాట్లాడుతూ హైదరాబాద్ తర్వాత అతి పెద్ద అభివృద్ధి కేంద్రంగా వరంగల్ ఏర్పడుతుందని తెలంగాణ ఉద్యమకారులు, యువత, ప్రజలు సంతోషపడి ఆశలు పెంచుకున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉమ్మడి వరంగల్ జిల్లాను ఆరు ముక్కలు చేసిందని, కానీ, హనుమకొండ, వరంగల్ రెండు జిల్లాలను వరంగల్ జిల్లాగా మార్చాలని డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా విద్యారంగంలో వెనుకబడి పోయిందని, అభివృద్ధి అథోపాతాళానికి నెట్టబడిందన్నారు. ఆజంజాహి మిల్లు అమ్ముడుపోగా, బీడీల పరిశ్రమ కుంగిపోయిందన్నారు. టెక్స్‌టైల్ పార్కు కాగితాలకే పరిమితమైందని, ఐటీ హబ్ నామమాత్రంగా మారిందని ఆరోపించారు. విభజన చట్టంలో హామీ ఇచ్చిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి గ్రహణం పట్టించారని, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ అటుకెక్కగా మామునూరు విమానాశ్రయం ఊసే లేదని ధ్వజమెత్తారు. అన్నిసమస్యలకు పరిష్కారం ఆ రెండు జిల్లాలను ఒకటి చేయడమేనన్నారు. సమావేశంలో ప్రముఖ సామాజిక వేత్త పింగిళి సంపత్‌రెడ్డి, న్యాయవాది గుడిమళ్ల రవికుమార్, విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులు పుల్లూరి సుధాకర్, సోమా రాంమూర్తి, నున్నా అప్పారావు, మేకల రవి, సోమిడి అంజన్‌రావు, గుల్షన్ అహ్మద్ పాల్గొన్నారు.

సీఎంను కలిసిన డాక్టర్ రామకృష్ణ

వరంగల్ మెడికల్, జూలై 13: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి జిల్లా ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు పుష్పగుచ్ఛం అందించి జిల్లా అభివృద్ధికి కృషి చేయాల్సిందిగా కోరారు.

సాట్ చైర్మన్‌ని కలిసిన డీవైఎస్‌వో

వరంగల్ స్పోర్ట్స్, జూలై 13: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన శివసేనరెడ్డిని హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అధికారి గుగులోత్ అశోక్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో శనివారం బాధ్యటలు చేపట్టిన నేపథ్యం లో శివసేనరెడ్డిని అశోక్‌కుమార్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మైనారిటీ గురుకులాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



జక్కలొద్ది మైనారిటీ గురుకులంలో పిల్లలతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

శంభునిపేట, జూలై 13: ఖిలావరంగల్ మండలం జక్కలొద్దిలోని మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలను శనివారం కలెక్టర్ సత్య శారద ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. తరగతి, వసతి గదులతోపాటు వంట గది నిర్వహణను పరిశీలించారు. పాఠశాలలో ఉన్న వసతులు, బోధన, బోధనేతర సిబ్బంది గురించి తెలుసుకొని, రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రిన్సిపాల్ భిక్షపతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పులి దేవేందర్

ముదిరాజ్‌ల రిజర్వేషన్ కోసం ఉద్యమం

రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్

సంగెం, జూలై 13: ముదిరాజ్‌ల రిజర్వేషన్ కోసం కుల సంఘాల తో కలిసి ఉద్యమం చేపట్టనున్నట్లు మెపా వ్యవస్థాపక(ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోషియేషన్) రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ చెప్పారు. శనివారం నల్లబెల్లి గ్రామ మత్స్యశాఖ అధ్యక్షుడు నీరటి రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఐక్య ఉద్యమాలు చేసేందుకు ముదిరాజ్ సంఘాలతో ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే సదుపాలయాలను పోరాడి తెచ్చుకోవాలని పిలుపునిచ్చారు. నీరటి రాజు మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికల్లో ముదిరాజ్‌ల సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో నీరటి సూరయ్య, సమ్మయ్య, సంపత్, ఐలయ్య, రాజు, సుధాకర్, ఎల్లయ్య, సతీష్ పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలందించాలి



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

వర్ధన్నపేట, జూలై 13: ఎలాంట అంతరాయం లేకుండా వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా చేయాలని టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం వర్ధన్నపేట 33/11 కేవీ సబ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఫీల్డ్ ఇంజనీర్స్ సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ సమయం, పరికరాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ పవర్ ట్రాన్స్‌ఫార్మర్, బ్రేకర్లు, ఏబీ స్విచ్‌లు బ్యాటీ చార్జర్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. ఎంఆర్‌టీ, టీఆర్‌ఈ విభాగాలు సబ్‌స్టేషన్‌లలో చేపట్టాల్సిన మెయింటెనెన్స్ పనులు కానీ, ఇతర టెస్టింగ్‌లు కానీ, ఇదే సమయంలో చేస్తే, మరోమారు విద్యుత్ అంతరాయం కలుగకుండా ఉంటుందన్నారు. ఏఈ నుంచి సీజీఎం వరకు సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటూ ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ అధికారులు భిక్షపతి, ఆనందం, రాజు, ఏఈ దయాకర్ పాల్గొన్నారు.

బీరన్న బోనాల కోసం ఏర్పాట్లు



కరీమాబాద్‌లో బందోబస్తుకై ప్రాంతాలను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

కరీమాబాద్, జూలై 13: తొలిఏకాదశి పర్వదినాన ఉర్సు, కరీమాబాద్ ప్రాంతం లో బీరన్నకు బోనాలను నిర్వహించనున్న నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారులు శనివారం ఆలయ ప్రాంతాలను పరిశీలించారు. డీసీపీ షేక్ సలీమా, ఏసీపీ నందిరామ్ నాయక్, మిల్స్‌కాలనీ సీఐ పి.మల్లయ్యలు ఉత్సవాలు కొనసాగే ప్రాంతాలను పరిశీలించారు. స్థానిక 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి ఉత్సవాల నిర్వహణ తదితర విషయాలను వారికి వివరించారు. బందోబస్తు నిర్వహణ విషయమై ఏసీపీ, డీసీపీలు కార్పొరేటర్‌తో చర్చించి ఆలయ ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు కోటేశ్వర్, యాకయ్య, రాజేశం, ప్రమీల, ఐలయ్య, కుమారస్వామి, కోటేశ్వర్ రావు, రాజు, కోటేశ్వర్, గౌతమ్, బాస్కర్ పాల్గొన్నారు.

'రైతుపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'



ఇంతేజార్‌గంజ్ పోలీసు స్టేషన్ వద్ద ఫిర్యాదు చేసిన రైతులు

వరంగల్ చౌరస్తా, జూలై 13: వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌కు కూరగాయలు తీసుకొచ్చిన రైతుపై దాడి చేసిన గుమస్తాలపై తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ శనివారం తెల్లవారుజామున మార్కెట్‌కు కూరగాయలు తీసుకురాగా, షాపు నంబర్ 38లో పనిచేస్తున్న గుమస్తా సునిల్, రంజిత్, వినోద్‌తోపాటు మరికొందరు గీసుగొండ మండలం అనంతారంనకు చెందిన రైతు సయింపూర్ వెంకటేశ్వర్ రావుతోపాటు మరో కొట్టడం బాధాకరమన్నారు. రైతులపై దాడి చేసిన వ్యక్తులను వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని పీడీ యాక్ట్ కేసు పెట్టి అరెస్టు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఇంతేజార్ గంజ్ పోలీసు స్టేషన్‌లో గుమస్తాలపై రైతులు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఓదెల రాజయ్య, బాధ్యులు సిరుల రవీందర్, ఎస్.వెంకటేశ్వరావు, రాంబాబు, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



స్థానికులకు ఉచితంగా మందులు అందజేస్తున్న కార్పొరేటర్ పద్మ

కరీమాబాద్, జూలై13: సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని 32వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మ రవి అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని బీఆర్ నగర్‌లో ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి అనిత ఆధ్వర్యంలో ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డెంగీ, మలేరియా వంటి విషజ్వరాలు బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మోహన్‌రావు, కృష్ణవేణి, స్వరూప పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు



ఆలయంలో మొక్కలు నాటుతున్న విజయ్‌చందర్‌రెడ్డి, కాళీప్రసాద్

గీసుగొండ, జూలై 13: భారతీయ జనతా పార్టీ పర్యావరణ పరిరక్షణలో భాగంగా దేశవ్యాప్తంగా చేపట్టిన మా కే నామ్ పర్ ఏక్ పెడ్ కార్యక్రమాన్ని గీసుగొండలో ఆ పార్టీ నాయకులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కంఠమహేశ్వర ఆలయం, జెడ్పీ పాఠశాల, బసవేశ్వర ఆలయంలో నేతలు పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, కాళీప్రసాద్‌లు మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన భారతదేశాన్ని నిర్మించేందుకు ప్రధాని మోదీ అకుంటిత దీక్షతో కృషి చేస్తున్నారన్నారు. మొక్కలు నాటి సంరక్షించే బాధ్యతను ప్రతీ ఒక్కరు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ ములక ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మగడ్డ జాన్‌విక్రం, నాయకులులు మొలుగూరి శ్రీనివాస్, పగడాల రాజ్‌కుమార్, కూతరు రాజు, డాక్టర్ రాజిరెడ్డి, వెంకన్న, రాజేష్, గిరిధర్, కత్తి రమేష్, వెంకటేశ్వర్లు, కందికొండ ప్రదీప్, రాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

16చింతల్‌తండాలో కొనసాగుతున్న పోలీసుల పికెటింగ్

చెన్నారావుపేట, జూలై 13: మండలంలోని 16చింతల్ తండాలో జంట హత్యలు జరిగిన నేపథ్యంలో రెండు రోజులుగా పోలీసు పికెటింగ్ కొనసాగుతోంది. వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా, డీసీపీ రవీందర్ ఆదేశాల మేరకు 16చింతల్ తండాతో పాటు మహబూబాబాద్ జిల్లా గూడూర్ మండలంలోని గుండెంగ ప్రాంతంలోనూ పోలీసు బందోబస్తును కొనసాగిస్తున్నారు. జంట హత్యలు జరిగినంతరం తండాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుండా ఎస్సై గూడ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో 16చింతల్ తండాలో రాత్రి, పగలు ప్రహార కాస్తున్నారు. తండాలోని ప్రధాన రహదారిలో బారికేట్లను ఏర్పాటు చేసి అనుమానితులను విచారణ చేస్తున్నారు.

ఈ హత్యకు సంబంధించి నిందితుడు నాగరాజును పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. కాగా, హత్య ఘటనకు సంబంధించి నాగరాజు ఒక్కడే చేశాడా? మరేవరన్న హత్యకు సహకరించారనే పలు కోణాల్లో పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. నాగరాజు నిత్యం తిరిగే గుండెంగ, నెక్కొండ పరిసర ప్రాంతాల్లోని మిత్రులను, పరిచయస్తులను ఆదుపులోనికి తీసుకొని విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. టాస్క్‌ఫోర్స్ పోలీసులు సైతం నిందితుడు తిరిగిన ప్రాంతాన్ని మరోసారి పరిశీలించి, విచారణను పలు కోణాల్లో చేస్తున్నట్లు తెలుస్తోంది. నిందితుడిని అరెస్టు చేసినప్పటికీ నాగరాజు జైలు నుంచి బయటకు రాకుండా చూడాలని, ఉరితీయాలని, నిందితుడికి సహకరించిన వారిని కూడా గుర్తించి కఠిన శిక్షలు అమలు చేయాలని, మరోమారు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు హెచ్చరించాలని తండవాసులు, పలువురు కోరుతున్నారు.

ఇల్లంద కేజీబీవీలో కలెక్టర్‌కు చేదు అనుభవం

వర్ధన్నపేట రూరల్, జూలై 13 : వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదకు చేదు అనుభవం ఎదురైంది. శనివారం వర్ధన్నపేట మండలంలోని ఇల్లందలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మొదటగా పాఠశాల, హాస్టల్ భవనాలను తనిఖీ చేసి విద్యార్థులతో మాటాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం కిచెన్ రూం పరిశీలించి, డార్మెంటరీ హాలును సైతం క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అక్కడ సైతం విరిగిన తలుపులు, దర్వాజలు, బూజు పట్టిన గోడలు దర్శనమిచ్చాయి. అనంతరం కేజీబీవీ ఆవరణలోని జూనియర్ కళాశాల సముదాయంలోకి వెళ్లారు. వెళ్తున్న దారిలోనే కుక్క ఎదురుగా వచ్చి పక్క నుంచే వెళ్లింది. కాలేజీ స్థితిగతులు తెలుసుకుని బయటకు వచ్చాక విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. అప్పుడు కూడా మళ్లీ కుక్క స్వైర విహారం చేస్తూ కనిపించింది.

కనుమరుగైన వృక్షజ్ఞాపిక

• వడ్డేపల్లి బండ్ అభివృద్ధి పనులకు బలి • ధ్వంసమైన వృక్షజ్ఞాపికలు • కాంక్రీట్‌వాల్ నిర్మాణంతో చెట్ల నరికివేత

హనుమకొండ, జులై 13 (ఆంధ్రజ్యోతి): చెట్ల పెంపకంపై ప్రధాని ఒక పక్క ఈ విధంగా హితబోధ చేస్తుంటే.. వరంగల్ మహానగర పాలక సంస్థ అధికారులు మాత్రం ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఇంట్లో శుభకార్యాలు, పుట్టినరోజు, పెళ్లి రోజుల జ్ఞాపకార్థం నాటిన మొక్కలను పీకిపారేస్తున్నారు. తమ కుటుంబ సభ్యు లు, నేతలపై అభిమానంతో వారి జ్ఞాపకార్థం నాటిన మొక్క లు ఏపుగా పెరిగిన తర్వాత అభివృద్ధి పనుల పేరుతో ధ్వంసం చేస్తున్నారు. వరంగల్ నగర పాలక సంస్థ ఎంతో ప్రచార్భాటంతో నిర్వహించిన వృక్షజ్ఞాపిక ప్రస్తుత పరిస్థితి ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. పుట్టిన రోజు, పెళ్లి రోజు గుర్తు గా వరంగల్ కార్పొరేషనే స్వయంగా మొక్కలు నాటేలా ప్రోత్సహించి అవి పెరిగి పెద్దవైన తర్వాత తన చేతులతోనే నరికించడంతో వృక్ష జ్ఞాపిక ఆనవాళ్లు లేకుండా పోయింది.

వృక్షదీపిక

మొక్కలు నాటడంపై ప్రజల్లో ఆసక్తిని పెంచడానికి గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ వృక్షజ్ఞాపిక వనం (గ్రీన్ లెగసీ) పేరిట కొంత కాలం కిందట వినూత్న కార్యక్రమం చేపట్టింది. పుట్టిన రోజు పెళ్లి రోజులతో పాటు తమ తల్లిదండ్రుల పేరిట ఎవరైనా కేయూ వంద ఫీట్ల రోడ్డును ఆనుకొని వడ్డేపెల్లి చెరువు కట్ట దిగువన మొక్కలు నాటేందుకు ఈ వృక్ష దీపిక వనాన్ని ఏర్పాటు చేసింది. పండ్లు, పూల మొక్కలకైతే ఒకొక్కదానికి నిర్వహణ ఖర్చు కింద రూ.516, వేప, రావి, మద్ది తదితర మొక్కలకు రూ.116 చెల్లిస్తే కార్పొరేషన్ అధికారులే వాటి రక్షణను చూసుకుంటారు. 2022 ఫిబ్రవరిలో శ్రీకారం చుట్టిన కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటిన వారిపేర్లతో బోర్డులు కూడా పెట్టారు. దీంతో వృక్ష జ్ఞాపికలను నాటేందుకు చాలా మంది ఉత్సాహంగా ముందుకు వచ్చారు. ఆయా పార్టీ ల నేతల అభిమానులు కూడా ఉత్సాహం కనబరిచారు. వ్యక్తులు, నేతల పేరిట సుమారు 500 మొక్కలు నాటగా ఇందులో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ చీఫ్ విప్ దాస్య వినయ్‌భాస్కర్ తదితర పేర్లతో నాటిన మొక్కలు కూడా ఉన్నాయి. ఈ మొక్కలు ఏపుగా పెరిగి పెద్దవయ్యాయి. సుమారు ఎకరం విస్తీర్ణంలో వృక్ష జ్ఞాపికను అభివృద్ధి చేశారు. దీని పక్కనే నర్సరీని కూడా పెంచారు. వృక్ష జ్ఞాపిక వద్ద పెద్దగేటుతో ప్రవేశద్వారాన్ని కూడా ఎంతో ఆకర్షణీయంగా ఏర్పాటు చేశారు. దానిపై వృక్షజ్ఞాపిక (గ్రీన్ లెగసీ) అని బోర్డు కూడా ఏర్పాటు చేశారు. మొక్కల పెంపకంపై హితోక్తులు కూడా రాశారు. ఇంత వరకు బాగానే ఉంది కానీ.. ఆ తర్వాత వడ్డెపల్లి చెరువు కట్ట అభివృద్ధి పనుల కింద ఈ వృక్షజ్ఞాపికను జ్ఞాపకంలో లేకుండా పోయింది

విచక్షణారహితంగా నరికివేత

స్మార్ట్‌సిటీ పథక కింద రూ.26కోట్ల అంచనా వ్యయంతో సుమారు 2 కిలోమీటర్ల పొడవైన వడ్డెపల్లి చెరువు బండ్ సుందరీకరణ పనులను నాలుగేళ్ల కిందట చేపట్టారు. అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఈ పనులకు శంకుస్థాపన చేశారు. బండ్ అభివృద్ధి పనుల్లో భాగంగా కేయూ వంద అడుగుల రోడ్డు వైపు చెరువు కట్టను ఆనుకొని కాంక్రీట్‌వాల్ నిర్మాణాన్ని చేపట్టారు.



వృక్షదీపికలు పోయి గేటు మాత్రమే మిగిలింది

ఈ వాల్‌ను నిర్మించే క్రమంలో కట్ట పొడవునా అడ్డంగా ఉన్న అనేక చెట్లను నిర్ధాక్షిణ్యంగా నరికివేశారు. ఇందులో భాగంగానే వృక్షజ్ఞాపికలోని చెట్లన్నిటినీ బుల్డోజర్‌తో తొలగించారు. దీంతో వృక్షజ్ఞాపికలోని కుటుంబ సభ్యులు , నాయకుల జ్ఞాపకార్థం నాటిన మొక్కలు నామరూపం లేకుండా పోయాయి. ప్రస్తుతం అక్కడ ఒక్క మొక్క కూడా లేదు. జ్ఞాపకాలు లేవు. జ్ఞాపికలు అంతకన్నా లేవు. మొక్కల వద్ద ఏర్పాటు చేసి న బోర్డులు కూడా అదృశ్యమయ్యాయి. వృక్ష జ్ఞాపిక బోర్డును సైతం తొలగించారు. ప్రస్తుతం గేటు ఒక్కటే మిగిలింది. గ్రేటర్ వరంగల్ మునిసిపల్ అధికారులు కొంచెం చొరవ తీసుకొని ఉంటే ఈ వృక్షజ్ఞాపికలు మిగిలేవి. కాంక్రీట్‌వాల్ నిర్మాణం సందర్భంగా కాంట్రాక్టర్‌కు ఎలాంటి సూచనలు, సలహాలు ఇవ్వకపోవడంతో కూలీలు జేసీబీతో మొక్కలను కూకటి వేళ్లతో పెకిలించి వేశారు. అధికారులు దగ్గరుండి చెట్లకు నష్టం కలుగకుండా పనులు జరిపించి ఉంటే వృక్షదీపిక ధ్వంసం కాకుండా ఉండేదని నగర పౌరులు అభిప్రాపడుతున్నారు.

"పర్యావరణ పరిరక్షణ కోసం అటవీ విస్తీర్ణం పెంపుపై ప్రతీ ఒక్కరు దృష్టి సారించాలి. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నా మాతృమూర్తి జ్ఞాపకార్థం ఒక మొక్కను నాటడం ఆనందంగా ఉంది. తల్లి గౌరవార్థం ఆమె పేరిట మొక్కను నాటే కార్యక్రమం వేగంగా దేశ ప్రజల్లోకి చొచ్చుకొని వెళ్లాలి. కన్నతల్లిలాంటి భూ గోళాన్ని రక్షించుకోవడంలో ఇలా మొక్కలు నాటడం దోహదం చేస్తుంది."

- మన్‌కీ భాత్‌లో ప్రధాని నరేంద్ర మోదీ



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL ఆదివారం 14 జూలై 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి • సంగెం • గీసుగొండ

సాగునీటి గండం

నీరులేక కళతప్పిన చెరువులు

ముందుకుసాగని వరి సాగు

నార్లు పోసుకునేందుకు జంకుతున్నరైతులు

నర్సంపేట డివిజన్‌లో దుర్భిక్ష పరిస్థితులు



చెన్నారావుపేట సమీపంలో వరి విత్తనాలు చల్లుతున్నరైతులు

నర్సంపేట, జూలై 13 : ఖరీఫ్ సీజన్ నెల పదిహేను రోజుల క్రితం ప్రారంభమైంది. అన్నదాతలకు సాగుకష్టా లు మొదలయ్యాయి. చేతిలో చిల్లిగవ్వలేక పంట పెట్టుబడుల కోసం నానా ఇబ్బందులను ఎదుర్కొన్నారు. తొలకరి వర్షాలకు పులక రించిన రైతులు అప్పులు చేసి వాణిజ్య పంటలను సాగు చేశారు. వరుణుడు ముఖం చాటే యడంతో సరైన వర్షాలు కురియక సాగునీటి గండం ఏర్పడి వరిసాగుకు శ్రీకారం చుట్టడానికి రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కురిసి చెరువుల్లోకి నీరు వస్తుందని భావించి కొందరు నారుమల్లు పోసుకోగా, మరికొందరు పోలాల్లో వరి విత్తనాలు చల్లుకుంటున్నారు. గత ఏడాది ఇదే సమయంలో కుంటలు రెండు పర్యాయాలు నిండి మత్తళ్ళు పోయగా, చెరువులు నిండుకుండలా మారాయి జూలై మొదటి వారం వరకే నాట్లను పూర్తి చేసుకున్నారు. ఈ ఏడాది చెరువులు, కుంటల్లోకి నీరు చేరక నార్లు పోసుకోలేని పరిస్థితులు నెలకొన్నాయి.

జిల్లాలోనే వ్యవసాయరంగంలో ప్రధాన భుమికను పోషిస్తున్న నర్సంపేట డివిజన్‌లో చెరువులు. కుంటల్లోకి నీరు చేరక ఖరీఫ్ కలిసివస్తుందో లేదోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. బంగాళాఖాతంలో వీచిన వాయు గుండం కారణంగా గత నెల పదిహేను రోజులుగావర్షాలు అడపదడప కురుస్తున్నా చెరువులు కుంటల్లోకి చెప్పుకో తగ్గట్లుగా నీరులేక నార్లు పోసుకునే పరిస్థితులు కనిపించక పోవడంతో రైతులు ఆందోళనచెందుతున్నారు. నీరడుగంటిన మాధన్నపేట, రంగాయ చెరువు, కోపాకుల, పెద్ద చెరువుల ను చూసి రైతులు దిగాలు చెందుతున్నారు. వరుణుడి కరుణకోసం గత రెండు నెలలుగా రైతులు ఎదురుచూశారు. బంగాళాఖాతంలో వీచన వాయు గుండం కారణంగా వర్షా లు కురుస్తాయని వాతావరణ శాఖా ధికారులు పేర్కొన్న డంతో ఖరీ వర్షాలు కురిసి చెరువులు కుంటల్లోకి సంవృద్ధి గా నీరు చేరుతుందని ఆశించిన రైతులకు నిరాశనిస్పృహలే మిగిలాయి. జిల్లాలోని పలు మండలాల్లోని చెరువులు, కుంటతోపాటు నర్సంపేట డివిజన్‌లోని పెద్ద చెరువుల్లోకి చెప్పుకో తగ్గ నీరు చేరలేదు. వర్షాకాలం ఆరంభమై రెండునెలలవుతున్నా అడపదడపా వర్షాలు కురుస్తున్నా చెరువుల్లోకి నీరు చేరక పోవడంతో ఈ ఏడాది సాగునీటి గండం ఏర్పడుతుందోమేనని రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరువుల్లో చెప్పుకోతగ్గట్టు నీరు లేకున్నా కొద్ది మంది నారుమళ్ళు పోసుకోగా మరి కొందరు తమ పంటపొలాల్లో నారుకోసం విత్తనాలను చల్లుకుంటు న్నారు. జిల్లాలో 1, 34, 899 ఎకరాల్లో వరి సాగులక్ష్యం కాగా నర్సంపేట డివిజన్‌లో 63వేల 845ఎకరాల్లో వరిసాగు కా వాల్సి ఉండగా ఇప్పవరకు 25శాతం మంది రైతులు వరి నారుమల్లు పోసుకునేందుకు సన్నద్ధం కాగా, 75 శాతం మంది రైతులు వరి సాగుకు ఇంకా శ్రీకారం చుట్టలేదు.

బోసిబోయిన మాధన్నపేట, కోపాకుల చెరువులు

నర్సంపేట మడలంలో వేలాది ఎకరాల పంట భూముల కు నీరందించే మాధన్నపేట, నల్లబెల్లి మండలంలో వంద లాది ఎకరాలకు సాగునీరందంచే రంగాయ చెరువు. చెన్నా రావుపేట మండలంలో అతిపెద్ద చెరువుగా గుర్తింపు పొంది న కోపాకుల, ముగ్దుంపురం ఊర చెరువుల్లో నీరులేక వెల వెల బోతున్నాయి. గత రబీసీజన్ అనంతరం 17 అడుగుల నీటి మట్టం కలిగిన మాధన్నపేట చెరువులో కేవలం 5 ఫీట్ల నీరుంది. గత కొద్ది రోజులుగా అడపదడప కురుస్తున్న వర్షపు జల్లులతో కేవలం అరఫీటు నీరు చెరువులోకిచేరాయి. ఈ చెరువులో 12 అడుగుల నీరుంటేనే నారుపోసుకునేందు కు. నాట్లు వేసుకునే అవకాశముంది. నల్లబెల్లిలోని రంగాయ చెరువులో కూడా ఆశించిన మేరకు నీరులేక ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరుల్లో నీరుసంవృద్ధిలేక పోవడంతో రైతులు ఖరీఫ్ పంటలను సాగుచేసేదెలా అని దిగాలు చెందుతున్నారు. చెరువులు, కుంటలు నిండేదశకు నీరు చేరితేనే వరి సాగయ్యే అవకాశాలున్నాయి. నీరులేక వరిపంట సాగుకు అవకావాలు లేకుండా పోయాయి. దీంతో దుర్భిక్ష పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందేమోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

పాఖాల కింద వరినారు మళ్ళ కోసం నీటి విడుదల

ఖానాపురం మండలంలో పాఖాల ఆయకట్టు రైతులు వరి నారు మళ్ల పోసుకునేందుకు ఒక్క పాఖాల చెరువు నీటిని శుక్రవారం ఎమ్మెల్యే దొంతిమాధవరెడ్డి నీటిని విడుద ల చేశారు. గత రబీసీజన్ అనంతరం ఈ చెరువులో 30 అడుగులకు గాను 17 అడుగుల నీటి మట్టం నిలువ ఉంది. నెల 15 రోజులుగా కురిసిన వర్షాలతో కేవలం 1 ఫీటు చేరు కొని 18 అడుగులకు చేరుకుంది. దీంతో ఆయకట్టు రైతులు నార్లు పోసుకునేందుకు చెరువు నీటిని విడుదల చేశారు. ఈ చెరువులోకి పాఖాల ప్రాజెక్టు నీటిని రబీ సీజన్‌లో మళ్లించడం నీరు నిలకడగా ఉంది.. నియోజకవర్గంలోని మిగిలిన మండలాల్లోని చెరువులు, కుంటల్లోకి నీరు చేరక నీటిని విడుదల చేసే పరిస్థితులు లేకుండా పోయాయి.



నీటి మట్టం తగ్గిన నర్సంపేట మండలం మాధన్నపేట చెరువు

చెరువు సమీపంలో ఓ రైతు వేసుకున్న నారుమడి

ఇల్లంద కేజీబీవీలో కలెక్టర్‌కు చేదు అనుభవం





కలెక్టర్ మాట్లాడుతుండగా కుక్కస్వైర విహారం, కళాశాల ఎదుట భోజనాలు చేస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

వర్ధన్నపేట రూరల్, జూలై 13 : వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదకు చేదు అనుభవం ఎదురైంది. శని వారం వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మొదటగా పాఠశాల, హాస్టల్ భవనాలను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం కిచెన్ రూం పరి శీలించి, డార్మెంటరీ హాలును సైతం క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అక్కడ సైతం విరిగిన తలుపులు, దర్వాజలు, బూజు పట్టిన గోడలు దర్శనమిచ్చాయి. అనంతరం కేజీబీవీ ఆవరణలోని జూనియర్ కళాశాల సముదాయంలోకి వెళ్లారు. వెళ్తున్న దారిలోనే కుక్క ఎదురుగా వచ్చి పక్క నుంచే వెళ్లింది. కాలేజీ స్థితిగతులు తెలుసుకుని బయటకు వచ్చాక విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. అప్పుడు కూడా మళ్లీ కుక్క స్వైర విహారం చేస్తూ కనిపిం చింది. దీనికి తోడు హాస్టల్ ఆవరణలో భారీ వృక్షాలు, పిచ్చి మొక్కలు, హాస్టల్ పరిసర ప్రాంతాల నుంచి గడ్డి మొలచి ఉండడంపై కలెక్టర్ చలోక్తులు వేసి అధికారులను నవ్వుతూ మందలించారు. కలెక్టర్ వచ్చిన విషయం తెలుసుకుని తహ సీల్దార్ విజయ్‌సాగర్, జీపీ కార్యదర్శి రామారావు అక్కడే ఉన్నప్పటికీ కనీస జాగ్రత్తలు పాటించకపోవడంపై విమ ర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వన భోజనాలు కాదు.. హాస్టలే ...

ఇక్కడి చిత్రంలో కనిపిస్తున్న ఫోటో వన భోజనాలకు వచ్చిన చిత్రం కాదు. రెండో శనివారం కావడంతో విద్యార్థు లను చూసి వారికి ఇష్టమైన వంటలు తెచ్చి తినిపించేం దుకు వారి తల్లిదండ్రులు కేజీబీవీ హాస్టల్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాల ఎదుట కూర్చుని వారి పిల్లలకు భోజనాలు తినిపిస్తున్నారు. ఈ తరుణంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద అక్కడికి రావడంతో విద్యార్థుల తల్లిదం డ్రులు సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. తీవ్రంగా పెరిగిన గడ్డి మధ్యలోనే కూర్చుని ఉండడం, చుట్టూ పిచ్చి మొక్కలు, చెట్లు, ప్రహరీ గోడ వెంట సైతం భారీగా పిచ్చి మొక్కలు ఉండడంతో హాస్టల్ స్థితిగతులపై తల్లిదండ్రులు పెదవి విరిచారు. కానీ, కలెక్టర్ వద్దకు వెళ్లి చెప్పేందుకు సాహసించలేకపోయారు. దోమలు, ఈగలు, కోతుల బెడద ఉందని, తీవ్రమైన గడ్డిలో విష పురుగులు సైతం వచ్చే అపాయం ఉందని తల్లిదండ్రులు మాట్లాడుకున్నారు.

మహిళల ఆర్థికాభివృద్దే ప్రభుత్వ లక్ష్యం

• ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందిస్తున్న మహిళ సంఘాల సభ్యులు

నెక్కొండ, జూలై 13 : మహిళలు అన్ని రంగాల్లో రాణిం చాలంటే ఆర్థికాభివృద్ధితోటే సాధ్యమౌతుందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండలంలోని దీక్ష కుంట గ్రామంలో గణేశ్, విగ్నేశ్వర గ్రామైక్య సంఘాల కమ్యూ నిటీ హాల్ చుట్టూ నిర్మాణం చేసిన ప్రహరీ గోడను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళా సంఘాలు ఆర్థికాభివృద్ధిని సాధించేందుకు రూ.20 లక్షల రుణాలను అందిస్తుందన్నారు. ఈ రుణాలను పొందేందుకు ప్రతి ఒక్క మహిళ సంఘం అర్హతను కలిగి ఉండాలని సూచించారు. గతంలో పొందిన రుణాలను సక్రమంగా చెల్లించాలని సూచిం చారు. నూతనంగా నిర్మాణం చేసిన కమ్యూనిటీ హాల్‌లో ఫ్లోరింగ్ నిర్మాణం, నీటి సౌకర్యం కోసం బోర్ ఏర్పాటుకు నిధు లను మంజూరి చేస్తామన్నారు. మహిళల అభివృద్ధికి వ్యక్తి గత రుణాలను అందిస్తున్నామని చెప్పారు. మహిళ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిన్న కుటీర పరిశ్రమల ద్వారా ప్రజలకు ఉపయోగకరమైన వస్తువుల తయారుకు మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలని ఎమ్మెల్యే మాధవరెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట టీపీసీసీ మెంబరు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, నెక్కొండ, నర్సంపేట మార్కెట్ చైర్మన్‌లు రావుల హరీశ్‌రెడ్డి, పాల్వాయి శ్రీనివాస్, శ్రీరామాలయ కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బక్కి, అశోక్, పట్టణ అధ్యక్షుడు హరిప్రసాద్, జిల్లా యూత్ అధ్యక్షుడు బండి శివకుమార్, ఎంపీడీవో వీరేశం, గ్రామ ప్రత్యే కాధికారి శ్రీనివాస్, ఏఈ రాజ్‌కుమార్, వెలుగు ఏపీఎం శ్రీనివాస్, నాయకులు రాచకొండ రఘు, మైపాల్‌రెడ్డి, చల్లా పాపిరెడ్డి, మెర్గు విజయ్, తిరుమల్, సాయికృష్ణ, కొల్లి సుబ్బా రెడ్డి, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

లే అవుట్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

వర్ధన్నపేట రూరల్, జూలై 13 : మండలంలోని ఇల్లందలో ఏర్పాటవుతున్న లే అవుట్‌పై స్థానికులు శనివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద దృష్టికి తీసుకెళ్లారు. తన కుటుంబ సభ్యుల వ్యవసాయ భూమి కబ్జాకు గురైందని, స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదని మంచోజు సత్యనారాయణ కేజీబీవీ పరిశీలనకు వచ్చిన కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంటనే పూర్తి విచారణ చేసి నివేదిక అందించాలని తహసీల్దార్ విజయ్ సాగర్‌ను ఆదేశించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



తొర్రూరులో సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే

రాయపర్తి, జూలై 13 : మండలంలోని పలు గ్రామాల కు చెందిన 30 మందికి పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి రూ.5,31,000 విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపి ణీ చేశారు. శనివారం తొర్రూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన చెక్కుల పంపిణీలో రాయపర్తి మండలానికి చెందిన వారికి ఆర్థిక సాయంగా ముఖ్యమంత్రి సహాయనిధిని అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు సైతం కార్పొరేట్ వైద్యం అందేలా సీఎం రేవంత్ రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.10 లక్షలకు పెంచారని తెలిపారు. కార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షు డు జాటోతు హమ్యానాయక్, మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పీరుల సందడి



తిమ్మంపేటలో పీరులతో తిరుగుతున్న ముస్లిం పెద్దలు, భక్తులు

దుగ్గొండి, జూలై 13 : మండలంలో మొహరం పండు గ సందర్భంగా ముస్లిం పెద్దలు, భక్తులు ఆరాధ్య దైవాలు గా భావించే హస్సేన్, హుస్సేన్‌ల జ్ఞాపకార్థం పీరులను నెలకొల్పి భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు గ్రామాల్లో ని అన్నివిధులు తిరుగుతున్నారు. గ్రామంలోని కూడలిలో హస్సేన్, హుస్సేన్‌ల ప్రతిరూపాలుగా పీరులను నెల కొల్పుతారు. 9రోజులపాటు భక్తుల మొక్కులు సమర్పిం చడానికి ప్రతీ ఇంటింటికి డప్పు చప్పుళ్లతో తిరుగుతూ 10 రోజు ఈ నెల 17న నీటిలో నిమజ్జనం చేస్తారు. మండ లంలోని తిమ్మంపేట, రేబల్లే, వెంకటాపురం, దుగ్గొండి తదితర గ్రామాల్లో పీరుల సందడి నెలకొంది. కార్యక్ర మంలో షేక్ జబ్బర్, సాంబయ్య, సదయ్య, ఎడ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలందించాలి



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

వర్ధన్నపేట, జూలై 13: ఎలాంట అంతరాయం లేకుం డా వినియోగదారులకు మె రుగైన విద్యుత్ సరఫరా చే యాలని టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం వర్ధన్నపేట 33/11 కేవీ సబ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఫీల్డ్ ఇంజనీర్స్, సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ సమయం, పరికరాలను పరిశీ లించి, సూచనలుచేశారు.వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ పవర్ ట్రాన్స్‌ఫార్మర్, బ్రేకర్లు, ఏబీ స్విచ్‌లు బ్యాట్రీచార్జర్లను ఎప్పటికప్పుడు తనిఖీచేయాలన్నారు. ఎంఆర్‌టీ, టీఆర్‌ఈ విభాగాలు సబ్‌స్టేషన్‌లలో చేపట్టాల్సిన మెయింటెనెన్స్ పనులు కానీ, ఇతర టెస్టింగ్ లుకానీ, ఇదేసమయంలో చేస్తే, మరోమారు విద్యుత్ అంతరా యం కలుగకుండా ఉంటుందన్నారు. ఏఈ నుంచి సీజీఎం వరకు సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్‌ను ప్రతిష్ఠా త్మకంగా తీసుకోవాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుం టూ ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లకుండా చర్యలుతీసుకోవాలన్నారు. కార్య క్రమంలో విద్యుత్ అధికారులు భిక్షపతి, ఆనందం, రాజు, ఏఈ దయాకర్ పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో అధికారుల ఆకస్మిక తనిఖీలు

వర్ధన్నపేట పట్టణంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను శనివారం ఆపరేషన్స్ డీఈ బి.భిక్షపతి, టెక్నికల్ డీఈ ఆనందం, ఆపరేషన్స్ ఏడీఈ కన్న రాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ వర్షాకాల సీజన్‌లో క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమ త్తంగా ఉండాలని ఆదేశించారు. ఏ మాత్రం సమస్య కనిపించినా వెంటనే ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్క రించాలన్నారు. వినియోగదారులు విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలని కోరారు. అనంతరం సబ్‌స్టేషన్‌లో కొనసాగుతున్న మరమ్మతు పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ దయాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు

నర్సంపేట, జూలై 13: పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో శనివారం మరమ్మతు పనులను విద్యుత్‌శాఖ అధికారులు దగ్గరుండి చేయించారు. ఉదయం 8.30 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేసి సబ్ స్టేషన్‌లో విద్యుత్ కార్మికులు మరమ్మతులు చేశారు. పలు వీదుల్లో విద్యుత్ లైన్లలో ఉన్న లోపాల ను చక్కదిద్దారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కార్మికులు చేస్తున్న మరమ్మతు పనులను డీఈ శ్రీధర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈ శ్రీధర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

చెన్నారావుపేట, జూలై 13 : మండలంలోని తిమ్మారాయిన్‌పహాడ్ గ్రామంలో శనివారం విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. గ్రామస్థుల కథనం ప్రకా రం... ఇదే గ్రామానికి చెందిన మదమంచి సత్యవతికి చెందిన పాడి గేదే రోజు వారి మాదిరిగా గ్రామ శివారులో మేత కోసం వెళ్లింది. ట్రాన్స్‌పార్మర్ పక్కన ఉన్న విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు పాడి గేదెకు తగలంతో అక్కడిక్కడే మృతి చెంది ంది. కాగా, మృతి చెందిన పాడి గేదెను పశువైద్యాధికారి మంజులాల్, జేఏల్‌ఎం మహేష్‌లు పరిశీలించారు.

ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యలు చేయడం తగదు

చెన్నారావుపేట, జూలై 13 : పదహారు చింతల్ తండాలో జరిగిన జంట హత్య కేసుపై ఎమ్మెల్యే మాధవరెడ్డి,ప్రభుత్వంపై అనుచితమైన వాఖ్యలను చేయడం మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి తగదని కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు భూక్య మో హన్‌నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేఖరులతో ఆయన మాట్లా డుతూ గతంలో జరిగిన సంఘటనలు మాజీ ఎమ్మెల్యే గుర్తుకు తేచ్చుకోవాలన్నారు. ప్రభుత్వపరంగా బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే మాధవరెడ్డి అండగాఉంటారన్నారు.

ఎస్సైని కలిసిన బీఆర్‌ఎస్ నేతలు

దుగ్గొండి, జూలై 13 : మండల పోలీసు స్టేషన్‌లో ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన నీలోజు వెంకటేశ్వర్లును శనివారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సుకినే రాజేశ్వర్‌రావు, మండల నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానం చేశారు. ఎస్సైని కలిసిన వారిలో మండల ఉపాధ్యక్షుడు లాండే రమేశ్, ప్రధాన కార్యదర్శి గుండెకారి రవికుమార్, మాజీ ఎంపీటీసీ మోర్తాల రాజు, పురుషోత్తం, కిష్టయ్య ఉన్నారు.

16చింతల్‌తండాలో కొనసాగుతున్న పోలీసుల పికెటింగ్

చెన్నారావుపేట, జూలై 13 : మండలంలోని 16చింతల్ తండాలో జంట హత్యలు జరిగిన నేపథ్యంలో రెండు రోజులుగా పోలీసు పికెటింగ్ కొనసాగుతోంది. వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా, డీసీపీ రవీందర్ ఆదేశాల మేరకు 16చింతల్ తండాతో పాటు మహబూబాబాద్ జిల్లా గూడూర్ మండలంలోని గుండెంగ ప్రాంతంలోనూ పోలీసు బందోబస్తును కొనసాగిస్తున్నారు. జంట హత్యలు జరిగినంతరం తండాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుండా ఎస్సై గూడ అరుణ్‌కు మార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో 16చింతల్ తండాలో రాత్రి, పగలు ప్రహార కాస్తున్నారు. తండాలోని ప్రధాన రహదారిలో బారికేట్లను ఏర్పాటు చేసి అనుమాని తులను విచారణ చేస్తున్నారు. ఈ హత్యకు సంబంధించి నిందితుడు నాగరాజును పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే, కాగా, హత్య ఘటనకు సంబంధించి నాగరాజు ఒక్కడే చేశాడా? మరేవరన్న హత్యకు సహకరిం చారనే పలు కోణాల్లో పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలుస్తుంది. నాగరాజు నిత్యం తిరిగే గుండెంగ, నెక్కొండ పరిసర ప్రాంతాల్లోని మిత్రులను, పరిచయస్తు లను ఆదుపులోనికి తీసుకొని విచారణ చేస్తున్నట్లు తెలుస్తుంది. టాస్క్‌ఫోర్స్ పోలీ సులు సైతం నిందితుడు తిరిగిన ప్రాంతాన్ని మరోసారి పరిశీలించి, విచారణను పలు కోణాల్లో చేస్తున్నట్లు తెలుస్తుంది. నిందితుడిని అరెస్టు చేసినప్పటికీ నాగరాజు జైలు నుంచి బయటకు రాకుండా చూడాలని, ఉరితీయాలని, నిందితుడికి సహక రించిన వారిని కూడా గుర్తించి కఠిన శిక్షలు అమలు చేయాలని, మరోమారు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు హెచ్చరించాలని తండ వాసులు, పలువురు కోరుతున్నారు.

తపాలా బీ(భీ)మా..!

తక్కువ ప్రీమియంతో ఎక్కువ కవరేజీ

వర్ధన్నపేట రూరల్, జూలై 13 : అనుకోని ప్రమా దాల్లో ఎవరైన చనిపోతే, వారిపై ఆధారపడిన కుటుం బాల పరిస్థితి దయానీయం. భార్య లేదా భర్త మరణి స్తే వారి పిల్లల చదువులు, ఇతర అవసరాల కోసం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సిన పరిస్థితి. అందుకే ఇటీవల కాలంలో ప్రమాద బీమాపై చాలా మందిలో అవగాహనపెరిగింది.ఈ క్రమంలో తపాలా శాఖ తక్కువ ప్రీమియంతోనే ఎక్కువ ప్రయోజనం చేకూరేలా ప్రమాద బీమా పథకాలను అందుబాటు లోకి తెచ్చింది. రూ.10 లక్షల నుంచి రూ. 15 లక్షల ప్రయోజనంతో హెల్త్‌ప్లస్, ఎక్స్‌ప్రెస్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీంలను ప్రవేశపెట్టింది.

బీమా సదుపాయాలు..

నివా హెల్త్ ఇన్సూరెన్స్, తపాలా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో తక్కువప్రీమియంతో రూ.10లక్షల నుంచి రూ.15 లక్షల ప్రమాద బీమా అందిస్తోంది. 18-65 ఏళ్లలోపు వరకు ఈ పథకానికి అర్హులు. ఏడాదికి ఒకే సారి రూ.555 ప్రీమియంతో రూ.10 లక్షలు, రూ.755 ప్రీమియంతో రూ.15లక్షల ప్రయోజనం పొందవచ్చు. పాలసీదారు ప్రమాదవశాత్తు మరణించిన సందర్భా ల్లో మాత్రమే వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు బీమా ప్రయోజనం అందుతుంది.

మరెన్నో ప్రయోజనాలు..

తపాలా శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న హెల్త్ ప్లస్, ఎక్స్‌ప్రెస్ ఇన్సూరెన్స్ స్కీంలతోపాటు ప్రమాదవశాత్తు మృతిచెందినా, ప్రమాదంలో శాశ్వత అంగవైకల్యం కలిగినా, కాలు, చేయి కోల్పోయినా, పక్షవాతం సంభ వించినా బీమా డబ్బు మొత్తం చెల్లిస్తారు. అలాగే పాలసీదారు పిల్లలు చదువుకుంటూ ఉంటే అదనంగా రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు ప్రయోజనం పొం దవచ్చు. పెళ్లీడుకు వచ్చిన పిల్లలుంటే వివాహ ఖర్చు లకు రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు ప్రయో జనం చేస్తారు. ప్రమాదంలో గాయాలతో ఆస్పత్రిలో చేరితే వైద్య ఖర్చులకు రూ.లక్ష వరకు చెల్లిస్తారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సయయంలో రోజుకు రూ.500 నుంచి రూ.1000వరకు, ఐసీయూలో ఉంటే రూ.1000 నుంచి రూ.2000 వరకు అందిస్తారు. పాల సీదారు మృతిచెందితే అంత్యక్రియలఖర్చుకు రూ.5వేలు ఆర్థిక సాయంచేస్తారు. ప్రమాదంలో ఎముకలు విరిగితే రూ.25వేల వరకు పొందుతారు. పాలసీ గడువు కాలంలో ఒకసారి ఆరోగ్య తనిఖీ, అపరిమిత టెలీ కన్సల్టెన్సీ ప్రయోజనాలు పొందవచ్చు.

సద్వినియోగం చేసుకోవాలి

లావురి సైదా నాయక్, సబ్‌డివిజన్ ఇన్స్‌పెక్టర్



నివాహెల్త్ ఇన్సూరెన్స్, పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో హెల్త్ ప్లస్, ఎక్స్‌ప్రెస్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీం లు అందుబాటులో ఉన్నాయి. ప్రీమియం ప్రారంభించిన 15 రోజుల తర్వాత నుంచి బీమా వర్తిస్తుంది. పాలసీ దారుడు మృతిచెందితే ఎఫ్ఐఆర్ కాపీ, ఇతర ధృవ పత్రాలతో క్లెయిమ్ చేసుకున్న నెల రోజుల్లో బీమా ప్రయోజనం అందుతాయి. అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలి.

డంపింగ్‌యార్డు లేక ఇక్కట్లు



వాహనాల పార్కింగ్ కోసం ఏర్పాటుచేయడంతో వృథాగా ఉన్న డంపింగ్‌యార్డు



రోడ్డుపక్కన వేస్తున్న చెత్త

పర్వతగిరి, జూలై 13 : డంపింగ్‌యార్డు లేక మండల కేంద్రంలో ప్రజలకు తీవ్ర ఇక్కట్లు ఎదురవుతున్నాయి. గత ప్రభుత్వం ప్రతీ గ్రామానికి డంపింగ్‌యార్డు నిర్మిం చాలని ఖరాఖండిగా చెప్పడంతో రిజర్వాయర్ వైపు ప్రభుత్వ స్థలంలో డంపింగ్‌యార్డు నిర్మించారు. అనంత రం రిజర్వాయర్ పక్కన ఉన్న గుట్టపై శివాలయం నిర్మించడంతో శివాలయానికి వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్ కోసం డంపింగ్ యార్డు స్థలాన్ని కేటాయిం చారు. దీంతో గ్రామంలో సేకరించిన చెత్తవేయడానికి గాను స్థలం లేకుండా పోయింది. చెత్త వేయ డానికి స్థలం లేకపోవడంతో పోలుకమ్మ చెరువు పక్కన ఉన్న కొద్దిపాటి స్థలంలో చెత్త ను వేస్తున్నారు. రోడ్డుకు పక్క నే ఉన్న స్థలంలో చెత్త వేస్తుం డడంతో అక్కడ వేసిన చెత్తం తా రోడ్డుపైకి వస్తుంది. దీనికితోడు వెనకవైపు ఉన్న పోలుకమ్మ చెరువులో చెత్తంతా కలిసిపోయి సాగునీరు కలుషితం అవుతోంది.

నిర్మాణం ఒక చోట.. చెత్త వేసేది మరోచోట

రిజర్వాయర్ వైపు ఉన్న స్థలంలో ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డును ఆలయ పార్కింగ్ కోసం వినియోగి స్తుండడంతో నిర్వాహకులు చుట్టూ ఫెన్సింగ్ వేసి గేటు ఏర్పాటుచేశారు. ఇక అక్కడ చెత్త వేసే వీలులేకపోవ డంతో చేసేదేమీలేక పోలుకమ్మ చెరువు పక్కన రోడ్డుకు అనుకుని ఉన్న కొద్దిపా టి స్థలంలో చెత్తను వేస్తున్నారు. అక్కడ వేసిన చెత్త రోడ్డంతా పరుచుకుంటుండడంతో పర్వతగిరి-నెక్కొండ ప్రధానరహదారిపై వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందు లు పడుతున్నారు. దీనికితోడు కొందరు ఇనుప వస్తువు ల కోసం చెత్తను తగులబెడుతుండడంతో రోడ్డంతా పొగ వ్యాపించి వాహనాలు అటువైపు వెళ్లే పరిస్థితులు లేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

కలుషితమవుతున్న చెరువునీరు

పోలుకమ్మ చెరువు పక్కనే చెత్త వేస్తుండడంతో చెరువులోకి చెత్త చేరుకుంటోంది. దీంతో సాగునీరు కలుషితమవుతుందని రైతులు వాపోతున్నారు. నీటిలోకి చేరిన చెత్త పక్కనే చెరువు తూము ఉండడంతో పంట కాలువ ద్వారా పొలాల్లోకి వస్తుందని అన్నదాతలు మండి పడుతున్నారు. ప్రభుత్వ నిధులు వెచ్చించి కట్టిన డంపింగ్‌యార్డును వృథాగా వదిలేసి చెరువుపక్కన చెత్త వేయడమేంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. మరో వైపు వాహనాల పార్కింగ్ కోసం ఏర్పాటుచేసిన డం పింగ్ యార్డు స్థలంలో వాహనాలు పార్కింగ్ చేయక పోగా మొక్కలు నాటారు. దీంతో అటు డంపింగ్ యార్డుకు, ఇటు పార్కింగ్‌కు పనికిరాకుండాపోయిందని గ్రామస్థులు మండిపడుతున్నారు. వెంటనే డంపింగ్ యార్డును తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు డిమాండ్‌చేస్తున్నారు.